

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: డెంగీ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ప్రభావతి అన్నారు. సోమవారం స్థానిక పిసిఆర్ హైస్కూల్‌లో "డెంగు నివారణ మాసోత్సవం"పై ర్యాలీ లాంచనంగా ప్రారంభించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట మంచినీరు, వాన నీటిలో డెంగీ కారకక్రిమి టైగర్ దోమ పెరుగుతుందన్నారు. ప్రజలు ప్రతివారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అందరూ నిర్వహిస్తే నీటి నిల్వలు ఉండవు లార్వాలు పుట్టవు అని వివరించారు. ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాల ద్వారా విపులంగా అవగాహన కల్పించి డెంగీ నుంచి అందరూ కాపాడుకొని ఆరోగ్యంగా ఉందామని తెలిపారు. మలేరియా అధికారి శ్రీనివాసులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శభాష్‌పింఛన్.!

- పండుగ వాతావరణంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ అందజేత
- ఉదయం 6గంటలకే ఆరంభమైన పంపిణీ
- తొలి రోజు జిల్లాలో 93.38శాతం పూర్తి


పూతలపట్టులో

ప్రజాశక్తి-పూతలపట్టు: పేదల అభివృద్దే సీఎం చంద్రబాబు ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్ పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది.. పూతలపట్టు మండలం, అమర్ రాజా గ్రూప్స్ అధినేత గల్లా రామచంద్ర నాయుడు స్వగ్రామం పేటమిట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయనతో పాటు కలెక్టర్ సుమిత్ కుమార్, అమరరాజ సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీరంతా కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అవ్వా, తాతలకు, వికలాంగులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళిమోహన్ ప్రసంగుస్తూ.. పేదల కళ్ళల్లో ఆనందం చూసేందుకు పింఛన్ పెంపు ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారులకు రూ.7వేలు సీఎం చంద్రబాబు అందించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.4000పెన్షన్‌తో పాటుగా, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో బకాయిలు ఉన్న రూ.3వేలతో కలిపి మొత్తం రూ.7వేల పెన్షన్ అందించామన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన సొమ్ముతో పాటు, ఏప్రిల్ నెల నుంచి కలిపి అందివ్వడంతో లబ్ధిదారుల ముఖాల్లో వెలుగు.. కళ్ళలో ఆనందం నింపాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, పార్టీల ప్రముఖులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పేదల పక్షపాతి, ప్రజా సేవకులు, నవ్యాంధ్ర సాధకుడు సీఎం చంద్రబాబు అని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు.

రామకుప్పం: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను టిడిపి, జనసేన, బిజెపి కూటమి శ్రేణులు, అధికారులు సమన్వయంతో పంపిణీ చేశారు. సోమవారం రామకుప్పంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, మునస్వామి, నారాయణ చారి, ఆంజనేయ రెడ్డి నరసింహులు, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: ఐరాల మండలం చిన్నకాంపల్లె పంచాయతీ వంద్రాంపల్లె పంచాయతీలో టీడీపీ నాయకులు శేషాద్రి నాయుడు, కుట్టిరెడ్డి ఆధ్వర్యంలో ఫించన్ లబ్ధిదారులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, నాయకులు మనోహర్ నాయుడు, నరేష్ నాయుడు, నవీన్ నాయుడు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మరెందరికో భరోసా అని వాణిజ్య విభాగ మండల అధ్యక్షులు వంశీ చౌదరి అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం బంగారుపాలెం మండలం గుంతూరు పంచాయతీ పరిధిలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాగరాజు నాయుడు, మధుసూదన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లి: ఆర్థిక భారం ఉన్న ఇచ్చిన మాటపై నిలబెట్టుకుంటూ పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో జాప్యం లేకుండా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, మాయల ఫకీర్ లాంటి వైసీపి మాటలు నమ్మొద్దని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ అన్నారు. సోమవారం తవణంపల్లె మండలం జి.గొల్లపల్లె నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా ఫించన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరై లబ్ధిదారులకు ఫించన్ పంపిణీ చేశారు.

చిత్తూరుడెస్క్: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు సోమవారం ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది ఈ పెన్షన్లను పంపిణీ చేశారు. నగరి మండలంలో 5644 మంది పెన్షన్ దారులు ఉండగా 5473 పెన్షన్లను సోమవారం పంపిణీ చేశారు. అలాగే నగరి మున్సిపాలిటీలో 7891 పెన్షన్లు ఉండగా 7393 పెన్షన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధి చింతలపట్టెడలోను, మండలంలోని వేలావడి ఎస్టీకాలనీలోను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పెన్షన్లను పంపిణీ చేశారు.

గంగవరం: మండలంలోని అన్ని పంచాయతీలలో ఉదయం 6గంటల నుంచే సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేశారు.

సోమల: మండలంలోని 15పంచాయతీల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు.

శాంతిపురం: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ను లబ్ధిదారులు అధికారులు సోమవారం ఉదయం 6గంటల నుంచే పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వనాథ్ నాయుడు, విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, మురళీమోహన్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: ప్రజల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. సోమవారం కార్వేటినగరం పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెంగల్రాయల్ యాదవ్, రాజేంద్రరెడ్డి, రవి యాదవ్, జనార్ధన్ రాజు, రమేష్, మోహన్, వాసుదేవ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సదుం: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం టీడీపీ నాయకలు ప్రారంభించారు. తాటిగుంటపాల్యెం పంచాయతీ కార్యాలయ ఆవరణలో మహేష్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, నారాయణ, రమణా రెడ్డిలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పవన్, దామోదర్ రెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పింఛన్ల పంపిణీ చేశారు. సోమవారం మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం సంక్షేమం అందించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎంపీడీవో భాస్కర్, స్వామి దాస్, నాయకులు దేవ సుందరం, వెంకటేష్, జ్యోతి రెడ్డి, సురేష్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంపిడీవో కార్యాలయ ఆవరణంలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. మండలంలోని గంటావారిపల్లిలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనాథ రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, బాబు రెడ్డి, ప్రకాష్ రెడ్డి,


జీడీ నెల్లూరులో


నగరిలో


గజేంద్రారెడ్డి, యుగాంధర్, ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్ పురం: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆల్ఫ్రెడ్ ధోని, ఎంపీడీవో మురళీమోహన్, ఏవో కృష్ణయ్య, నాయకులు జయశంకర్ నాయుడు పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని సోడిగానిపల్లి పంచాయతీ మల్లేపల్లి గ్రామంలో సోమవారం అధికారులు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరై ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బాబు నాయుడు, సుబ్రమణి, బాలచంద్ర, మునుస్వామి శెట్టి తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో


గుడిపల్లిలో


బంగారుపాళ్యంలో

రగులుతున్న పుంగనూరు.!



- అగ్రనేతలపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం
- వైసీపీ నేతలకు పసుపు తివాచీ వేయడం విడ్డూరమని అసహనం
- రక్తం చిందించి, జైల్లో మగ్గిన కార్యకర్తల మనోభావాలు పట్టవా అని మండిపాటు
- ప్రత్యర్థులను ఎలా పార్టీలోకి ఆహ్వానిస్తారంటూ ధ్వజం
- పెద్దిరెడ్డితో పాటు సొంత పార్టీ నేతలపైనా తిరుగుబాటుకు కార్యచరణ?

ప్రజాశక్తి-పుంగనూరు:

"పెద్దిరెడ్డి అడ్డాలో ఎన్ని అవరోదాలెదురైనా నిలబడ్డాం.. ఎత్తిన పార్టీ జెండా విడువకుండా పోరాటమే ఆయుధంగా పార్టీ విజయానికి కృషి చేశాం.. పోలీసులతో వచ్చినా.. దౌర్జన్యంగా వచ్చినా.. రక్తం చిందినా.. నిలబడి పసుపు జెండానే పట్టి ఎదురొడ్డి తిరుగుబాటు చేశాం.. జైల్లో మగ్గినా.. ఎన్నడూ వెన్నుచూపలేదు.. అలాంటిది టీడీపీ విజయం సాధించి పట్టుమని 15 రోజులు కూడా గడవలేదు.. అంతలోనే ప్రత్యర్థి పార్టీ మున్సిపల్ ఛైర్మన్, 12మంది కౌన్సిలర్‌లను ఎలా టీడీపీలోకి చేర్చుకుంటారు.." అని పుంగనూరు టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నాయి. అవమానించిన వారిని అక్కున చేర్చుకొని పార్టీ శ్రేణుల మనోభావాలు లెక్క చేయరా అంటూ టీడీపీ అదినాయకత్వంపై తమ్ముళ్లు తీవ్ర స్థాయిలో విరుచకుపడుతున్నారు. ప్రత్యర్థులతో పాటు.. సొంత పార్టీపై కూడా తిరగపడే పరిస్థితులు తెచ్చుకోవద్దంటూ ఓ రకంగా హెచ్చరిస్తున్నారు.

పుంగనూరు నియోజకవర్గానికి రాష్ట్ర రాజకీయాల్లోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009 నియోజకవర్గాల పునర్విభజనానంతరం ఆ స్థానం మాజీ మంత్రి పెద్దిరెడ్డికి అడ్డాగా మారింది. అయన ఇక్కడ నుంచి నాలుగు సార్లు విజయం సాధించారు. రాష్ట్ర రాజకీయాలలో కీలకంగా వ్యవహరించారు. చిత్తూరు జిల్లా వైసీపీ పార్టీ తరపున అన్ని తానై వ్యవహరిస్తున్నారు. గెలిచిన నాలుగు దఫాల్లో మూడు సార్లు అత్యధిక మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అంచువరకూ వెళ్లి ఊహించని స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు.

పక్కకు తప్పుకొనే పరిస్థితి నుంచి ఎదురొడ్డి నిలబడే స్థాయికి..

టీడీపీ స్థానంలో 2009లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీ చేసి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి పెద్దిరెడ్డి రాజకీయ చతురత ముందు తప్పుకున్న టీడీపీ నేతలే ఎక్కువని చెప్పాలి. దాదాపుగా నియోజకవర్గంలో టీడీపీని అణచివేశారు పెద్దిరెడ్డి. నాలుగు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన వైసీపీ అక్కడి ప్రత్యర్థి పార్టీ, అన్యాయాలను ఎదురించిన వారిపై అణచివేసే ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో మొదలైన తిరుగుబాటు పెద్దిరెడ్డిని ఎదుర్కొనే స్థాయికి టీడీపీ శ్రేణులు ముందుకు అడుగేశారు. అడుగడుగునా టీడీపీని బలోపేతం చేసుకుంటూ వచ్చారు. ఆఖరికి పెద్దిరెడ్డికి ఎదురుగా పసుపు జెండా పట్టి నిలబడ్డారు.

పుంగనూరు అల్లర్లతో మరింత దూకుడు..

ఏడాది కిందట ప్రతిపక్ష హోదాల్లో ప్రాజెక్టు సందర్శనకు టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరుకు వచ్చారు. పుంగనూరు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లే క్రమంలో పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని వైసీపీ నేతలు చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేపట్టి నల్లబెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య ఘర్షణ చోటుచేసుకొని పోలీసుల జోక్యం, అల్లర్లుతో టీడీపీ నేతలపై పెద్ద సంఖ్యలో కేసులు నమోదైయ్యాయి. అదే క్రమంలో టీడీపీ నేతలకు రక్తం చిందింది. అప్పటి నుంచి పుంగనూరులో వైసీపీని ఓడించేందుకు టీడీపీ శ్రేణులు దూకుడుగా వ్యవహరించాయి.

15ఏళ్లుగా కేసులే కేసులు..

పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీసీవై పార్టీ నేతలు, సానుభూతి పరులపై 15ఏళ్లుగా వరుస కేసులు నమోదైనట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నారు. తీవ్ర అనచివేతకు యత్నించిన క్రమంలో పుట్టిన తిరుగుబాటు పెద్దిరెడ్డిని ఎదురించే వరకూ వెళ్లిందని వారు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజా రెండు దఫాలు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పుంగనూరు పర్యటకు సిద్ధమవడంతో ముందుగానే టీడీపీ శ్రేణులు "గో బ్యాక్ పెద్దిరెడ్డి" అంటూ నినాదాలు చేయడంతో పాటు వస్తే అడ్డుకొని తీరుతామంటూ ఆందోళన సైతం చేపట్టారు. దీంతో పెద్దిరెడ్డి పర్యటనను విరమించుకున్నారు.

తాజా పరిణామాలతో టీడీపీ నేతల గుర్రు

తాజాగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) స్వల్ప మెజారిటీతో పరాజయం పాలైయ్యారు. టీడీపీ అధికారం చేపట్టాక చల్లా బాబు సమక్షంలో ఆయన నివాసం వద్ద పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్, 12మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో టీడీపీ కేడర్ పూర్తిగా అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షంలో ఉన్నన్నాళ్లూ ఎవరి వల్ల ఇబ్బందులు పడ్డామో వారికే పసుపు తివాచీ వేయడం విడ్డూరమంటూ రగిలిపోతున్నారు.

సొంత పార్టీ తీరుపై మనోవేదన

వైసీపీ నేతల వల్ల బాధింపబడి, జైలులో మగ్గి, దెబ్బలుతిని, లాఠీ దెబ్బలకు అల్లాడిన తమను కాదని పొరుగు పార్టీ నేతలను ఎలా చేర్చుకుంటారని టీడీపీ నేతలు ఆ పార్టీ అధినాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టుమని 15 రోజులు కూడా గడవకనే పాలనమెచ్చి వస్తున్నామంటున్న నేతలను ఎలా నమ్ముతారంటూ మండిపడుతున్నారు. పెద్దిరెడ్డే పంపించారా.. లేక.. ఇనాళ్లు చేసిన అవినీతి అక్రమాల నుంచి బయటపడటానికి టీడీపీలోకి వచ్చారా.. అంటూ పరిపరివిధాలుగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ చేసిన అక్రమాలు పార్టీ మారితే సక్రమమైపోతాయా అంటూ తెలుగుతమ్ముళ్లు బాహాటంగానే విమర్శిస్తున్నారు. టీడీపీ అదినాయకత్వం తీరును మార్చుకోకుంటే సొంత పార్టీపై కూడా తిరుగుబాటు చేయకతప్పదనే హెచ్చరికలు చేస్తుండడం పుంగనూరు రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉంది.

శాంతిపురం డిప్యూటీ సర్వేయర్ సస్పెన్షన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్, శాంతిపురం:

శాంతిపురం మండల డిప్యూటీ సర్వేయర్ ఎస్.సద్దాం హుస్సేన్‌ను సస్పెండ్ చేస్తూ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలలోకి వెళితే.. జూన్ 27న ఒక రైతు నుంచి సర్వే పని పూర్తి చేయడానికి రూ.లక్ష డిమాండ్ చేశారని డిప్యూటీ సర్వేయర్‌పై అభియోగంను ఒక రైతు చేయడం జరిగింది. ఆ మేరకు ఆయన వద్ద నుంచి లిఖిత పూర్వకంగా సమాధానం కోరగా అందుకు ఆయన ఇచ్చిన సమాధానంపై జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఏపీ సివిల్ సర్వీసస్ యాక్ట్ 8 ప్రకారం సర్వే ల్యాండ్ రికార్డ్స్ వారు జిఓఎం ఎస్ 102 ప్రకారం ఆయన సస్పెన్షన్‌కు సిఫార్సు చేశారు. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన విచారణకు సహకరించడంతో పాటు శాంతిపురం మండల కేంద్రంలో వుండాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించాలి: కలెక్టర్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సాధారణ ఎన్నికలు 2024లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చు వివరాలను రికన్సిలేషన్ కొరకు ఈ నెల 3వ తేదీ లోపు సమర్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో 25-చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు శంకర్‌ప్రసాద్ శర్మ, పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ ఖన్నా, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రోహన్ ఠాకూర్‌లతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడిన 26వ రోజున అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాల రికన్సిలేషన్ సమావేశంలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రికన్సిలేషన్ ప్రక్రియకు అభ్యర్థులు తమ ఖర్చు వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంకా ఖర్చు వివరాలను తెలపని వారు ఈ నెల 3వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. ఈ ఖర్చు వివరాలను ఆన్ లైన్ పోర్టల్ లో అప్ లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా సమర్పించాలన్నారు. ఈ సమావేశానికి డిఏఓ కృష్ణారెడ్డి, ఎన్నికల అభ్యర్థుల తరపున ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎన్‌టిఆర్ ఆరోగ్య శ్రీ సేవ ప్రారంభం



ప్రజాశక్తి-గుడిపల్లి: కుప్పంలోని కె.సి ప్రైవేట్ ఆసుపత్రిలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభించనున్నట్లు కే.సి.ఆసుపత్రి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

విన్నపాలు వినవలె.. వింత వింతలూ..

పెద్ద సార్లకు సమస్య చెప్పుకొందామని.. ఇట్టే పరిష్కారమైపోతుందనే కోటి ఆశలతో.. సిరాక్షలతో లిఖించిన అర్జీలు చేత పట్టుకొని సుదూర ప్రాంతాల నుంచి జిల్లా ప్రజలు సోమవారం కలెక్టరేట్‌కి పోటెత్తారు. ఒకటా రెండా.. 104అర్జీలు సమర్పించి.. సమస్యలను జిల్లా అధికారులకు మొరపెట్టుకొన్నారు. ఎలాగైనా పరిష్కరించండి సార్ అంటూ.. విన్నవించారు.

- ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు జనం క్యూ
- కలెక్టరేట్‌లో 104 అర్జీలు
- నగరపాలికలో 5 వినతులు
- ఎస్పీ కార్యాలయంలో 32 ఫిర్యాదులు


సమస్యలు వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్‌లు ప్రజల వద్ద నుంచి విన్నపాలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను విన్న కలెక్టర్ సత్వర పరిష్కారం చూపాలని సంబంధించిన అధికారులను పురమాయించారు. తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా జిల్లా నలుమూలల నుంచి 104 అర్జీలు అందగా వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 81, రోడ్లు, భవనాలు శాఖ 1, జిల్లా పౌర సరఫరాలు 3, డిఆర్‌డిఏ 12, మున్సిపల్ శాఖ 01, విభిన్న ప్రతిభా వంతుల శాఖ 01, డియల్‌ఎస్‌ఎ 1, డిఎస్‌యల్‌ఓ 1, విద్యుత్ శాఖ 01, డిసిఓ ఆరోగ్య శ్రీ 1, హౌసింగ్ శాఖ 01 అర్జీలు అందినట్లు అధికారులు వివరించారు.

ఎస్పీ కార్యాలయంలో..

చిత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి ప్రజల నుంచి 32 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కాగా ప్రజల సమస్యలను స్వయంగా ఎస్పీ మణికంఠ చందోలు, అడ్మిన్ ఏఎస్పీ ఆరిఫుల్లా, డీఎస్పీ సుధాకర్ రెడ్డి సమస్యల ను స్వీకరించారు. కుటుంబ తగాదాలు 2, వేదింపులు 6, ప్రేమ వివాహం 1, డబ్బు తగా దాలు 11, భూ తగాదాలు 7, ఆస్తి తగాదాలు 5 అందాయి. ఈ ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు పరిష్కారం చూపాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

నగరపాలిక కార్యాలయంలో..

చిత్తూరు నగరపాలిక సంస్థ పరిధిలో ప్రజల వద్ద నుంచి ఐదు వినతులు అందినట్లు కమిషనర్ డాక్టర్ అరుణ తెలిపారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మెప్మా 3, ఇంజనీరింగ్ 1, ప్రజారోగ్య విభాగం 1 చొప్పున వినతులు అందినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

మహిళా వర్సిటీ విసి ఆచార్య భారతి రాజీనామా

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య దేవూరి భారతి సోమవారం మధ్యాహ్నం తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామాను రాష్ట్ర గవర్నర్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నూతన విధి, విధానాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని విసిలు అందరూ రాజీనామా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆచార్య భారతి వర్సిటీ విధుల నిమిత్తం, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆమె తన


రాజీనామా చేసిన శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విసి భారతి

రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ కు పంపించారు. రెండు రోజుల క్రితం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ఉన్న ఆచార్య వంగిమళ్ల శ్రీకాంత్ రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇలాంటి నిర్ణయాలతో వర్సిటీలలో ఉన్నతాధికారులు రాజీనామా చేయడంతో ఇన్‌ఛార్జిల పాలనలో వర్సిటీ పరిపాలన గాడి తప్పుతుందని విద్యార్థి సంఘాల నేతలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



ప్రజాశక్తి-కార్వేటినగరం: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆర్కేవిబి పేట గ్రామంలో రైతులకు ఉచితంగా వేరుశనగ బస్తాలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ఉచితంగా 100మందికి విత్తనాలు పంపిణీ చేయడం అభినందనీయమని, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వర రాజు కృషి ఎంతో ఉందని తెలిపారు. ఆర్కేవిబి పేట, అన్నూరు పంచాయతీలను రాస్ కృషి సంస్థ దత్తతకు తీసుకోవడం జరిగిందని కోఆర్డినేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ దివ్య, ఎఓ హేమలత, ఎపిఓ జాహ్నవి రైతులకు మామిడి వేరుశనగ పంటలపై అవగాహన కల్పించరు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ పుష్ప కుమారి, చంద్రబాబు రెడ్డి, హేమంత్ రెడ్డి, రాము, పవన్ కుమార్, రాంబాబు రెడ్డి, టిడిపి నాయకులు జనార్దన్ రాజు, చెంగల్రాయల్ యాదవ్, పొన్న యుగంధర్, రాఘవ, కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



ప్రజాశక్తి-సోమల: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని కనిపించని దేవుళ్ళ కన్నా కనిపించే దేవుళ్ళు వైద్యులేనని కొనియాడారు. అనంతరం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డిని, సిహెచ్ఓ అమర్నాథ్‌ను, వైద్య సిబ్బందిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం: కమిషనర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణానికి నీరు అందించే పైపులు లీకేజీ వల్ల ఈనెల 3, 4వ తేదీల్లో గూడూరు పట్టణానికి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణ పరిధిలోని వేములపాలెం నుండి జెండా మాను వరకు గల మంచి నీటి జీఆర్‌పి పైపు లైనుకి సంబంధించి పది లీకులు ఏర్పడ్డాయని తెలిపారు. జీఆర్‌పి పైపు లైను మరమ్మతుల్లో భాగంగా గూడూరు ఒకటవ, రెండవ పట్టణాలలో మంచి నీటి సరఫరా అందించేందుకు అంతరాయం ఏర్పడిందని, పట్టణ ప్రజలు దీన్ని గమనించి మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

టీమిండియా విజయం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టీ20 ప్రపంచ కప్‌లో టీమిండియా విజయం స్ఫూర్తి దాయ కమని శ్రీ గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి పాఠశాల ఆవరణలో విద్యార్థులు బ్యాటు, బాలు ఆకారంలో కూర్చుని టీమిండియా జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీ20 ప్రపంచ కప్ సాధించి దేశానికి కీర్తి, ప్రతిష్టలు తెచ్చి పెట్టారన్నారు. టీమిండియాను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకొని మరెన్నో విజయాలు దేశానికి తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నాగలాపురం వెస్ట్ హరిజనవాడలో తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు మండల కార్యా లయంలోని సూపరింటెండెంటు వనజకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు మురుగేసిన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తాగునీటి పైపులైన్లు తుప్పు పట్టి పూర్తిగా డ్రైనేజీ నీళ్లలో కలవడంలో ప్రజలు వింత వింత వ్యాధులతో బాధపడుతున్నారని కాలువలను కనీసం వారంలో ఒక్కరోజైనా శుభ్రం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి తుప్పు పట్టిన పైప్ లైన్లకు మరమ్మతు చేసి శుభ్రమైన తాగునీటిని అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దినమని, మీనా, అయినమ్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మాతమ్మ కొలుపు

ప్రజాశక్తి- డక్కిలి: మండలంలోని పాతనాలపాడు అరుంధతి వాడలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మాతమ్మ కొలుపు సోమవారం ఘనంగా ముగిసింది. సోమవారం తెల్లారుజామున భక్తులు అమ్మవారికి అభిషేకం, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మ వారికి నిర్వహించిన అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కొలుపు ఉత్సవం విజయవంతం చేసేందుకు సహకరించిన దాతలు, ఉత్సవ సంప్రదాయ నిర్వాహకులకు గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొమ్మన మధుసూదన్ రావు, ఉపాధ్యక్షుడిగా కొండేటి చక్రపాణి, కార్యదర్శిగా కొండేటి గోపాల్, కోశాధికారిగా పెళ్లూరు కార్తిక్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెడికల్ దుకాణదారుల సమస్యలపై పోరాడేందుకు, పరిష్కరించేందుకు కెమిస్ట్ అండ్ డ్రగ్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని నూతన కమిటీ హామీ ఇచ్చింది. ఎన్నికల పరిశీలకులుగా అమర జనార్దన్ రావు, సుబ్బా రామగుప్తాలు వ్యవహరించారు.

ఘనంగా రాగల ఆనంద గౌడ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అన్నమయ్య భవన్ ఎదుట తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ జన్మదిన సందర్భంగా మిత్రులు, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మిత్రులు మాట్లాడుతూ ఎస్వీయూలో విద్యార్థి నాయకుడిగా అనేక పోరాటాలు చేసి, పేద విద్యార్థులు సమస్యల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. యూనివర్సిటీ నుంచి విద్యార్థి నాయకుడిగా ఎదిగి టిడిపిలో క్రియాశీలకంగా చురుకైన పాత్ర పోషించిన ఆనంద్ గౌడ్‌కి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్ శేషాద్రి నాయుడు, హరికృష్ణ యాదవ్, పత్తిపాటివివేక్, ఉదయ్ కుమార్ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అశోక్, బషీర్, బీసన్న పాల్గొన్నారు.

'పెద్దిరెడ్డి ఆక్రమించిన రోడ్డును తెరిపించండి'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో 18వ డివిజన్లోని మారుతీ నగర్‌లో వేసిన రోడ్లలో ప్రజలను నడవనీయకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గేట్లు పెట్టి వినియోగించుకుంటున్నారని, దాన్ని ప్రజల అవసరాల కోసం గేట్లను తొలగించి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని టిడిపి నగర అధ్యక్షులు చిన్నబాబు కమిషనర్ అదితి సింగ్ వినతిపత్రం ఇచ్చారు. 2020 సంవత్సరంలో రూ.9.55లక్షలు, మరొకటి రూ.9.50 లక్షలతో నామినేషన్ కింద సిసి రోడ్లు వేశారని, వైసీపీ ప్రభుత్వ హయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎవరిని ఈ రోడ్డులో రానివ్వకుండా గేట్లు పెట్టారని తెలిపారు. ఈ గేట్లు తొలగించి ప్రజల సౌకర్యాల కోసం తెరిపించాలని కోరారు.

న్యాయవ్యవస్థను సరిదిద్దేలా కొత్తచట్టాలు

- తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: భారతీయ న్యాయ వ్యవస్థను సరిదిద్దడానికి 'భారతీయ ఆలోచనలపై ఆధారపడిన న్యాయ వ్యవస్థ'ని స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక ప్రకాశంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త క్రిమినల్ చట్టాలు ప్రజలను 'వలసవాద మనస్తత్వం', దాని చిహ్నం నుంచి విముక్తి చేస్తాయని, మన మనస్సులను నిర్వీర్యం చేశాయన్నారు. ఈ చట్టాలు శిక్షపై కాకుండా న్యాయంపై దృష్టి సారిస్తాయన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

'సబ్ కే సాథ్ సమాన్ వ్యవర్' అనేది ప్రధాన థీమ్ అన్నారు. అవి అసలైన భారతీయ న్యాయ నియమావళి నిజమైన స్ఫూర్తిని వెల్లడిస్తాయని పేర్కొన్నారు. ఇవి భారత రాజ్యాంగ స్ఫూర్తితో రూపొందించారని చట్టాలు వ్యక్తిగత భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు హామీ ఇస్తున్నాయన్నారు. మానవ హక్కుల విలువ దాని ప్రధానాంశం అన్నారు. కొత్త చట్టాల ఆత్మ న్యాయ, సమంత ఔర్ నిష్పాక్షత అని తెలిపారు. వీటిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు డిఎస్పీలు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మహిళల భద్రతకు మరిన్ని పదునైన నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని గూడూరు డిఎస్‌పి సూర్య నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం నూతన చట్టాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చట్టాలు దేశంలో అమలులో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం వాటి స్థానాల్లో నూతన చట్టాలను ప్రవేశపెట్టిందని, నూతన చట్టాలు జూలై 1వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయన్నారు. దీంతో నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తూ పోలీస్ శాఖ అధికారులు గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రజలకు


నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి

కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్‌పి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గతంలో వున్న చట్టాల సంఖ్య ను తగ్గించారని పలు కేసులకు సంబంధించి శిక్ష కాల పరిమితి పెంచారని తెలిపారు. నూతన చట్టాల ద్వారా నిర్ణీత కాలంలో బాధితులకు కోర్టులలో న్యాయం అందు తుందని తప్పుడు కేసులు పెట్టే వారిపై చర్య లు తీసుకునే అవకాశం నూతన చట్టం ద్వారా ఏర్పడు తుందని పేర్కొన్నారు. ప్రజలు నూతన చట్టాలపై అవగాహన కలిగి సక్రమంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి..

డిఆర్‌ఓకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా డిఆర్ఓ పెంచుల కిషోర్‌కి సిపిఎం పుత్తూరు డివిజన్ కార్యదర్శి వెంకటేష్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు మున్సిపాల్టీలోని జ్యోతి బస్ నగర్‌లో 2019 లో హౌసింగ్ కింద ఇళ్లు ఇచ్చారని, వాళ్లందరూ ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నారని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సలాపురం లెక్కదాఖలలోని సర్వే నంబర్ 10లో పశువుల మేత బీడు భూములకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.


డిఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు వెంకటేష్

ఎగువగులూరు దళితవాడలోని సిమెంట్ రోడ్డు, సుడిగా రాజపురం రింగ్ రోడ్ నుంచి తడుకు ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని, విద్యుత్ సదాశివపురం ఎస్‌సి, ఎస్‌టిలకు ఇళ్ల పట్టాలిచ్చారని వారికి ఆన్‌లైన్‌లో వన్ బి సౌకర్యం కల్పించాలని, భోజనత్తం గుంట పోరంబోకు భూమిని సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని, నంది మంగళం శ్మశానంలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన డిఆర్ఓ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి నందయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: సీజనల్ వ్యాధులపై మండల వైద్యాధికారులు అవగాహన కల్పించారు. 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, మండలాధికారి త్రివిక్రమరావు, ఎంఈఓ రవీంద్రనాథ్, సిడిపిఓ, వసతి గృహాధికారి రామయ్య, మండల అధికారులు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చినాయుడు కండ్రిగ బీసీ సంక్షేమ హాస్టల్ పిల్లలకు సీజనల్ వ్యాధులైన డయేరియా, విష జ్వరాలపై అవగాహన కల్పించారు. శరీర పరిశుభ్రత పాటించాలని భోజనానికి ముందు, మల విసర్జన తరువాత, ఆహారం వడ్డించే ముందు, మట్టిలో ఆడుకున్న తర్వాత, పొలం పని చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. తాజా ఆహార


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పదార్థాలు, వేడి ఆహారం, క్లోరినేషన్ చేసిన నీరు తీసుకోవడం ద్వారా డయేరియాను నివారించవచ్చన్నారు. పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిలవకుండా చూసుకోవడం ఫ్రైడే డ్రైడే పాటించడం, ఇంటి చుట్టూ గుంతలు లేకుండా చూసుకోవడం, దోమతెరలు వాడడం వంటి ద్వారా దోమల అభివృద్ధిని నిరోధించి, డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, బోధకాలు వ్యాధి నుండి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. హాస్టళ్లలో, వంటశాలలో దోమలు, ఈగలు రాకుండా కిటికీలకు మెస్ వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): నిరుద్యోగ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని, ఎవరో కల్పించే ఉపాధి కోసం ఎదురు చూడకుండా సొంతంగా బేకరి వంటి వాటిని ఏర్పాటు చేసి ఉపాధి పొందటం పలువురికి ఆదర్శ నీయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రశంసించారు. చంద్రగిరి పట్టణంలో నెమ్మలగుంటపల్లి గ్రామానికి చెందిన బోడి రెడ్డి బ్రదర్స్ ఈశ్వర్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, పురుషోత్తమ రెడ్డి బ్రదర్స్ ఏర్పాటు చేసిన రాఘవేంద్ర బేకరిని ఆయన సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నాని కొంత డబ్బులను గల్లా పెట్టిలో వేసి బేకరీ ఐటమ్స్‌ను మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సొంతంగా చిన్న చిన్న పరిశ్రమలు ప్రారంభించి మరి కొంత మందికి ఉపాధి కల్పించాల న్నారు. పదార్థాలలో నాణ్యత పాటిస్తే త్వరితగతిన వ్యాపారం అభివృద్ధి చెందుతుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆరి లీల మోహన్ నాయుడు, ఎస్ గౌస్ బాషా, వి సుబ్రహ్మణ్యం నాయుడు, వి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో చేరిక

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు వైసి గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద పాలేరు వైసి గ్రామంలోని బడి మానేసిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులను కలసి వారిని బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కె రవీంద్రనాథ్, ఎ మునిసుబ్రహ్మణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు గంగారావు, సిఆర్ఎంటి లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నారాయణవనం మండలం పడివేటమ్మ ఎస్‌టి కాలనీలో ఎంపీడీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బడి మానేసిన విద్యార్థిని విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం మండల ఎంఈవో ప్రభాకర్ రాజు పాల్గొన్నారు. ఈ


బుచ్చినాయుడు కండ్రిగలో ర్యాలీ

కార్యక్రమంలో ఎస్ పడవేటమ్మ, హెడ్మాస్టర్ ఏ శివ ప్రభు, జడ్పీహెచ్ఎస్ అరణ్యం కండ్రిగ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌విఆర్ట్స్ కళాశాల సందర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో 1968-71 మధ్య డిగ్రీ చేసిన పూర్వ విద్యార్థి ప్రస్తుతం అమెరికాలోని నార్త్ టెక్సాస్ యూనివర్సిటీలో బయాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య పూదూరు జగదీశ్వర్ సోమవారం ఆర్ట్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో కళాశాలలో ఎంతో నిబద్ధతగా అధ్యాపకులు చెప్పిన పాఠాలను గుర్తుంచుకొని విజయం సాధించామన్నారు. గురువులు చెప్పిన ప్రతి అంశాన్ని విద్యార్థులు సమగ్రంగా సంగ్రహించి, సబ్జెక్టు పై పట్టు సాధించడం ద్వారా దేశ, విదేశాలలో వివిధ రంగాలలో రాణించవచ్చున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అమెరికాలోని నార్త్ టెక్సాస్ యూనివర్సిటీ బయాలజీ ప్రొఫెసర్ అయిన జగదీశ్వర్ ను కళాశాల అధ్యక్షులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఘనంగా దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో చదివిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు దేశంలోని అత్యున్నత రంగాలలో రాణించాలని కోరారు. ముఖ్యంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత ద్వితీయ పౌరుడిగా, ఉపరాష్ట్రపతిగా పని చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భీమన్న, కామేశ్వరరావు, కిరణ్, చంద్రబాబు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -తడ: 1860 నాటి బ్రిటీష్ చట్టాలను మార్చాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలపై ప్రజలకు డిఎస్పి శ్రీనివాసుల రెడ్డి తడ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత చట్టాల ప్రకారం నేరాల నియంత్రణ కష్టంగా వుందని నేర నియంత్రణ , సైబర్ నేరాలను అరికట్టాలంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో త్వరితగతిన నేర నియంత్రణ చాలా తక్కువ సమయంలో సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేసిన కొత్త చట్టాల ప్రకారం బాధితులు పోలీస్ స్టేషన్‌కు రాకుండా ఇంటి వద్దనే జీ మెయిల్ ద్వారా ఫిర్యాదు ఇవ్వవచ్చునని చాలా వరకు ఇంటర్నెట్ ద్వారా ఫిర్యాదు లాంటి చాలా మార్పులు తీసుకొస్తున్నారని డిఎస్‌పి తెలిపారు. ఈ మార్పుల ద్వారా ఫిర్యాదు నమోదైన మూడు రోజులలో విచారించిన తర్వాత ఫిర్యాదులో నిజానిజాలు తెలుసుకుని కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మధు బాబు, ఎస్ఐ నర్సింహారావు వీరుతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బిసి ఎంప్లాయీస్ ఫెడరేషన్ సమన్వయకర్తగా బడి సుధాయాదవ్

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతిలోని బిసి ఎంప్లాయీస్ ఫెడరేషన్ సమన్వయకర్తగా బీసీ ఉద్యోగులు బడి సుధాయాదవ్‌ను ఎన్నుకున్నారు. సోమవారం బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి సుధా యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిసి ఎంప్లాయీస్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బి.గోపాల్, బిసిఈఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్ట భాస్కర్, గౌరవాధ్యక్షులు సురేష్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకీపురం పవన్, బిసి ఉద్యోగులు బడి సుధాయాదవ్‌ను సన్మానించారు.



బడి సుధా యాదవ్‌ను సన్మానించిన బీసీ ఉద్యోగులు

డయేరియాపై అవగాహన



ప్రజాశక్తి-శాంతిపురం: డయేరియాపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్లు జిల్లా అదనపు డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ తెలిపారు. మండలంలో డయేరియాపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి నెలాఖరు వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డెంగీ, అతిసారలపై ఆశా, ఏఎన్ఎం, ఎమ్ఎల్ హెచ్ పి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఈ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ముఖ్యంగా 5సంవత్సరాలలోపు పిల్లలందరినీ గుర్తించి, డయేరియా లక్షణాలు, నివారణ చర్చలు, చేతులు పరిశుభ్రత, రక్షిత త్రాగు నీరు, శుభ్రమైన ఆహారం, వ్యక్తి గత పరిశుభ్రత గురించి, వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి.మైథిలి, రాళ్ళబూదుగూరు, శాంతిపురం వైద్యాధికారులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శివకుమారి, డాక్టర్ ఉషా, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సోమల: అతిసార వ్యాధిని నివారించడం పూర్తిగా అరికట్టడం కోసం ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్రతి ఒక్కరు తాగాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి కోరారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం పరిశుభ్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సోమల పంచాయతీ దళితవాడ పాఠశాలలో విద్యార్థులకు, ప్రజలకు అతిసార వ్యాధి నివారణ మార్గాలు అతిసార వ్యాధి రాకుండా తీసుకోవలసిన చర్యలుపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగికి సన్మానం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తపాలా శాఖ ఉద్యోగి సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ చెందిన సందర్భంగా సోమవారం బంగారుపాలెం మండల కేంద్రంలోని తపాలా శాఖలో సన్మాన కార్యక్రమం ఎస్‌పిఎం మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా సూపరింటెంట్ ఆఫ్ పోస్ట్ మాస్టర్ లక్ష్మణయ్య ఏఎస్‌పి విద్యావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తపాలా శాఖలో ఉద్యోగి పనులు చేయడం చాలా కష్టతరంగా ఉన్నదని ప్రస్తుతం ఆధునిక సాంకేతికత ఆందపుచ్చుకొని పనులు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారన్నారు. తక్కువ వేతనాలతో సిబ్బంది పనిచేయడం చాలా గొప్ప విషయమని పనిలో క్రమబద్ధతని కచ్చిత తప్పనిసరిగా పాటించే వాళ్ళని అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చెందిన సుబ్రహ్మణ్యంని దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని తపాలా శాఖ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు రామచంద్ర, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నగరి, వెదురుకుప్పం, నింద్ర, విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు టీచ్ టూల్‌పై శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన మెరుగుపరచుటకు, విద్యార్థులకు అనుగుణంగా బోధించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి బోధన పద్ధతుల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పార్వతీ దేవి, జిల్లా పరిశీలకులు ప్రభాకర వర్మ, విషయ నిపుణులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

- యువకుడి మృతి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి బంగారుపాలెం మండలం సద కుప్పం వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జున్ ఇచ్చిన సమాచారం మేరకు.. తవణంపల్లి మండలం అరగొండ గొల్లపల్లి చెందిన బాలాజీ (30) యువకుడు స్వగ్రామం నుంచి సొంత పని నిమిత్తం బంగారుపాళ్యంకు వచ్చి తిరుగు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు వివరించారు. ఈ సంఘటనలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. శవ పంచనామా కోసం మృతదేహాన్ని బంగారుపాల్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ